క్లుప్తంగా

రాంపూర్‌కు బస్సు సర్వీసు ప్రారంభం



నర్వ: మంత్రి డా.వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు రాంపూర్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసును శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో బస్సుకు తోరణాలు కట్టి పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చిన బస్సు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బంద్ అయ్యిందన్నారు. గ్రామస్థుల అభ్యర్థన మేరకు మంత్రి డిపో అధికారులను ఆదేశించడంతో బస్సును నడపనున్నట్లు తెలిపారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు మరికల్ నుంచి రాంపూర్ మీదుగా ఆత్మకూర్‌కు వెళ్తుందన్నారు. సాయంత్రం తిరిగి 5 గంటలకు రాంపూర్ నుంచి ఆత్మకూర్‌కు వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వివేకావర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

కోస్గి రూరల్: నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందిస్తున్నట్లు సర్జఖాన్‌పేట్ గ్రామ మాజీ సర్పంచ్ హరీష్‌గౌడ్ అన్నారు. పలువురు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా నగదు మంజూరైంది. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధిత కుటుంబాలకు రూ.4.70 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

ఆస్పత్రిలో అన్నదానం



నారాయణపేట రూరల్: మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లయన్ ఘనశ్యామ్ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు శుక్రవారం మండలంలోని అప్పక్ పల్లి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దాదాపుగా 500 మంది రోగులు, రోగుల బంధువులకు అన్నదానం చేసి మంచిమనసును చాటుకున్నారు. కార్యక్రమంలో లయన్ సభ్యులు వెంకటేష్, మహేష్, రామ్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గందె రవికాంత్, మధుసూదన్ రెడ్డి, కృపాకర్ రెడ్డి, రఘు బాబు, శ్రీను, హర్కంచి రవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి రూరల్: కోస్గిలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్రం-2 , ఫిజిక్స్-2 , మాథ్స్-2 ,ఈఈఈ-3 , సివిల్-4 , సీయంఈ- 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబందిత సబ్జెక్టుల్లో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఫిల్/ పీహెచ్‌డీ/ఎంఎస్సీ చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని 6న ఇంటర్వ్యూలు 7న ఎంపిక ఉంటుందన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ



కొత్తపల్లి: వనమహోత్సవంలో భాగంగా కొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రతి ఇంటికి పంచాయతి కార్యదర్శి శ్రీను నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులుతో కలిసి మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ చెట్లే జీవకోటికి ప్రాణాధారమని మొక్కలను పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటి ఆవరణలో పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు, పండ్ల మొక్కలను పెంచుకోవాని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు,పంచాయతి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పత్తి రైతుల ఆనందం

మరికల్: ఇటీవల వారం పాటు కురిసిన వర్షాలకు మండలంలో పత్తి పంట ఏపుగా పెరిగింది. దీంతో ఎటుచూసిన పచ్చని పత్తి పంట ఆకట్టుకుంటుంది. మండలంలో దాదాపు 23 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. సారవంతమైన భూముల్లో పత్తి పంట ఏపుగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటలు గూడ దశలో ఉండటంతో ఒక్కొక్క చెట్టుకు 30 వరకు పత్తికాయలు రావడం విశేషం.

గుట్టుగా గుట్కా దందా

- పేరుకే గుట్కా నిషేధం
- లోలోపల జోరుగా సాగుతున్న విక్రయాలు
- బైకులపై వచ్చి విక్రయిస్తున్న వ్యాపారులు



దామరగిద్దలో పట్టుబడిన గుట్కా పాకెట్లు (ఫైల్)

ధన్వాడ: మండలంలో గుట్కా దందా జోరుగు సాగుతోంది. కొందరు అక్రమార్కులు గుట్టుగా ప్రభుత్వం నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతూ రూ.లక్షలు గడిస్తున్నారు. పేరుకే గుట్కా నిషేధం ఉంది కానీ పోలీసులు తనిఖీలు నిర్వహించక పోవడంతో విచ్చలవిడిగా గుట్కా తంబాకు విక్రమాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్న చిన్న కిరాణ దుకాణాలు, పాన్‌షాపులో బహిరంగంగానే గుట్కా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

జోరుగా విక్రయాలు..

గుట్కాల నిషేధం అంటూనే పలు కంపెనీలు పాన్ మసాలా పేరిట కొత్త గుట్కాలు తయారు చేసి బహిరంగంగా అమ్మకాలు చేస్తున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలలో, గ్రామాలలో రోజు వందల సంఖ్యలో గుట్కాలతో పాటు తంబాకు ప్యాకెట్లు కూడా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. గుట్కాల నిషేధం అమలులో ఉన్నా అవేమీ పట్టించుకోకుండా మార్కెట్‌లో విచ్చలవిడిగా అమ్ముతున్నారు.

కర్ణాటక నుంచి దిగుమతి

ఎక్కువ శాతం గుట్కాలు కర్ణాటక నుంచి సమీప జిల్లాలకు వస్తున్నాయి. బైకులపై వీటిని తీసుకొచ్చి ప్రతి షాపులో అమ్మకాలు చేస్తున్నారు. అమ్మకాలు జరపకూడదు అని ఉండటంతో దొంగచాటుగా తెచ్చి అమ్మకాలు జరుపుతున్నారు. దీంతో రూ.10 ఉన్న గుట్కా ప్యాకెట్‌ను రూ.20 చేసి అమ్మకాలు చేస్తున్నారు. దీంతో వ్యాపారులు భారీగా వెనకేసుకుంటున్నారు.

దాడులు చేస్తున్నా..

గతంలో గుట్కా వ్యాపారులపై పోలీసులు ఉక్కుపాదం మోపడంతో కొంత వరకు అమ్మకాలు తగ్గాయి. అయితే ప్రస్తుతం ఏడాదిగా ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంతో చాపకింద నీరులా ఈ వ్యాపారం విస్తరిస్తూనే ఉంది. దీంతో ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకపోగా ధరల పెరుగుదల కారణంగా గుట్కాలు తినే వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతం అయిన కర్ణాటక నుంచి అక్రమంగా గుట్కాలను తెప్పించి జిల్లా వ్యాప్తంగా రవాణా చేస్తున్నారు.

ఆరోగ్యానికి హానికరం

గుట్కా తినడంవల్ల చాలా అనారోగ్య సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా శ్వాసకోస వ్యాధులు, నోటి క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



గుట్కా విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. కిరణా, పాన్ షాపుల్లో గుట్కాలు విక్రయించడం నేరం. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించే వారిపై మళ్లీ నిఘా పెట్టి విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం. ఎక్కడైనా గుట్కా విక్రయాలు జరుపుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలి. – రాజశేఖర్, ఎస్ఐ, ధన్వాడ

‘బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం’



అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న పుర కమిషనర్ శ్రీకాంత్

మద్దూరు: పట్టణంలో రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, ఏఎంసీ చైర్మన్ భీములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపులు కోల్పోతున్న బాధితులతో పుర కమిషనర్ శ్రీకాంత్ అభిప్రాయ సేకరణ చేపట్టారు. మొదటగా పీఆర్ ఏఈ జగన్ మోహన్‌రెడ్డి రోడ్డు విస్తరణ కోసం 35 పీట్ల మేర రోడ్డును ఏ విధంగా విస్తరిస్తారో వారికి వివరించారు. అనంతరం బాధితుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. మెజార్టీ ప్రజలు రోడ్డు విస్తర్ణం తగ్గించాలని కోరారు. ఇంత పెద్ద మొత్తంలో రోడ్డు విస్తీర్ణం చేస్తే అందరం నిరాశ్రయులం అవుతామన్నారు. విస్తీర్ణం తగ్గించి, పట్టణానికి బైపాస్ రోడ్డు వేయాలని సూచించారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను, కట్టుకోలేని పరిస్థితిలో ఉంటే కూడా ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని కాంగ్రెస్ నాయకులు సూచించారు. రోడ్డు విస్తరణ ఎంత వరకు చేయాలో బాధితులందరూ కలిసి సోమవారం వరకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రహమతుద్దీన్, పుర సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు..

నారాయణపేట రూరల్: బాలికలకు అండగా షీ టీం ఉందని కానిస్టేబుల్ బాలరాజు అన్నారు. మండలంలోని బొమ్మన్ పాడు జడ్పీ పాఠశాలలో శుక్రవారం షీ టీం సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండ్‌లో పోకిరీలు ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా, మాయమాటలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వచ్చినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల డీపీలతో వాట్సాప్ కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే నిరాకరించాలని, తక్కువ ధరలకు వస్తువులు, వాహనాలు అమ్ముతామని, లాటరీల పేరుతో మోసం చేసేవారి నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. బస్సుల్లో ప్రయాణం చేసే సమయంలో విలువైన వస్తువులు, డబ్బులను జాగ్రత్త పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నయ్య, జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఐపీ ప్లాంటేషన్‌పై అధికారుల సన్నాహాలు

ధన్వాడ: మండలంలోని కోండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో వీఐపీ ప్లాంటేషన్ వనమహోత్సవం కోసం శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టారు. ఎన్ఆర్‌జీఎస్ కూలీలతో మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వి సిద్ధం చేశారు. వర్షాలు ప్రారంభమైన తరువాత మొక్కలను నాటుతామని ఏపీఓ సిద్దేశ్వర్ తెలిపారు. అనంతరం సిబ్బందితో కలిసి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీ ప్రసన్నకుమార్, టీఏ శ్రీనివాస్, ప్రిన్సిపల్ రాజారాం, పంచాయతీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఉపాధిహామీ అధికారులు

శ్రీగిరిపై అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో శ్రీగిరిపీఠంపై కొలువైన భవానీ మాత అలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తకోట శివానంద స్వామి ఆధ్వర్యంలో భవానీ మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, కుంకుమార్చన, అనంతరం మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమార్చన పూజలు

ధన్వాడ: శ్రావణ శుక్రవారం పురష్కరించుకొని మండల కేంద్రంలోని అంబా భవానీ దేవాలయంలో మహిళలు కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు చంద్రశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు అరుణశ్రీ, అనురాధ, శిరీష, భార్గవి, వెంకటేశ్వరమ్మ, ఇంద్రావతి, వేదవతి, జ్యోతి, అరుణ, కుర్వలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతం

నారాయణపేట: పట్టణంలోని మాలాంబిక దేవి అలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణస్వామి వేదమంత్రాల మధ్య అమ్మవారికి కుంకుమార్చనలు, విశేష అలంకరణ, అభిషేకాలు, మహామంగళహారతి నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చిన్నారుల నృత్య ప్రదర్శన



మక్తల్: యాదాద్రిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మినర్సింహస్వామి దేవాలయంలో మక్తల్‌కు చెందిన బాలబాలికలు గిరి ప్రదక్షిణ మహోత్సవంలో భరతనాట్య ప్రదర్శన నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నారు. శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల అన్నమయ్య సేవ తెలంగాణ డైరెక్టర్ మీనాక్షి పర్యవేక్షణలో నాట్య ప్రదర్శన చేయగా సభ్యులు బాలబాలికలను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నృత్యాలయ నాట్యాచారిణి జోషి హరతి గోపాలచార్య, కళకారులు, బాలబాలికలు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్: ప్రముఖ పుణ్య క్షేత్రం యాదాద్రి వేదికగా నారాయణపేటకు చెందిన అలేఖ్య గౌడ్(అడ్వకేట్), పూజారి సమర సింహా గౌడ్(ఆర్‌టీసీ) దంపతుల కూతురు ఆద్య శ్రీ యాదాద్రిలో భరతనాట్య నృత్య ప్రదర్శన చేసి చూపరులను ఆకట్టుకుంది.

బిల్లుల కోసం ఎదురుచూపులు



మరికల్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పునాది స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం అందజేసే మొదటి విడత బిల్లు కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మొదటి విడతలో మండలంలోని 17 గ్రామాలకు 272 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 152 మంది నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుల్లో 70 ఇళ్లు పునాది వరకు వచ్చాయి. మిగిత ఇళ్ల పనులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. పునాది వరకు పూర్తి చేసిన లబ్ధిదారులు మొదటి బిల్లు మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తేనే బిల్లులు చెల్లిస్తామన్ని అధికారులు చెబుతున్నారు. కొందరు పనులు నిలిపి వేసేందుకు ఇష్టం లేక అప్పులు చేసి ఇంటి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు.

రూ.5వేలు పింఛన్ ఇవ్వాలి



మక్తల్: ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలో జిల్లా అసోషియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్రాంతి పీఈటీ గోపాలం ఆటో డ్రైవర్లకు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది ఆటోడ్రైవర్లు ఉన్నారని వారిని ప్రభుత్వం తరపున సంక్షేమ పథకాలను అందజేయాలని కోరారు. 50 ఏళ్లు నిండిన ఆటోడ్రైవర్లకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. వడ్డిలేని రుణాలు, బీమా, జీవిత బీమా ఏర్పా టు చేయాలని కోరారు. ప్రభుత్వం తరపున అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు నాగ రాజు, దేవా, ఖలీల్, శివకుమార్, కృష్ణమూర్తి, రాజు, నరేస్, శేఖర్, మహ్మద్అలీ, చందు, మన్సూర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పేరుతో మొక్క నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: మొక్కలు పెంచడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మక్తల్ మండలం సంగంబండ గ్రామంలో సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు. మొదటగా తల్లి పేరుతో మొక్కను నాటి రాములమ్మ అని పేరు పెట్టారు. ప్రతి ఒక్క విద్యార్థి తన తల్లిపేరు మీద మొక్క నాటి దానిని సంరక్షించాలని సూచించారు. పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు ఉన్నారని అందరు ఒక్కో మొక్క నాటి అది పెరిగే విధంగా బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేస్తామని అందరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటుకోవాలని కోరారు. సంగంబండ గురుకుల పాఠశాల రాబోయే రోజుల్లో ఒక రోల్ మోడల్‌గా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఎఫ్ఓ ప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ మొగులప్ప, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్, ఈసీలు శ్రీనివాసులు, శైలజ, ఎంపీడీఓ రమేశ్, తహసీల్దార్ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం అందించండి



మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న భూ నిర్వాసితులు

మక్తల్: మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులను ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకోవాలని , తగిన న్యాయం చేయాలని జిల్లా భూ నిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, భూములు కోల్పోతున్న కుటుంబాలకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. కొంత మంది రైతులకు భూములు లేకుండా పోతున్నాయన్నారు. ప్రభుత్వం తరపున బాధిత రైతులకు న్యాయం చేసిన తర్వాత భూములను సేకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మచ్చందర్, ఉపాధ్యక్షుడు ధర్మరాజు, సంఘం నాయకులు గోపాల్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, ఆంజనేయులు, గోవిందురాజ్, మొగులప్ప, లక్ష్మికాంత్, తిమ్మారెడ్డి, మాలనర్సిములు, రాఘవేందర్, రాజు, అంజనేయులు, అనంతరెడ్డి, కనకప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరును ఎడారిగా మార్చింది కేసీఆరే



మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

నారాయణపేట రూరల్: కేసీఆర్ పదేళ్ల అధికారంలో ఉండి పాలమూరు జిల్లాలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చారని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా నుంచి అత్యధిక ఎమ్మెల్యే సీట్లు అందించి కేసీఆర్‌ను ఇక్కడి ప్రజలు సీఎంని చేసినా పాలమూరు ప్రజలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. జిల్లా పర్యటనలో ఎమ్మెల్సీ కవిత అబద్ధపు మాటలతో రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని, బూటకపు మాటలను నమ్మే పరిస్థితుల్లో పేట ప్రజలు లేరన్నారు. ఏళ్ల తరబడి జీవో 69 కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రోద్బలంతో సీఎం రేవంత్ రెడ్డి పనులను ప్రారంభించారని, దీనిని అడ్డుకోవడం కవితకు తగదన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకొని నిజామాబాద్‌లో ఎలా గెలవాలో ఆలోచించాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు ఎండి యూసఫ్ తాజ్, శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ నాయకులు

నారాయణపేట రూరల్: మహిళా ప్రయాణికురాలి పట్ల దురుసుగా ప్రవర్తించిన కండక్టర్ పై చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ డీఎం లావణ్య, సీఐ అలివేలమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం రాత్రి ఆరుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు మద్దూరు నుంచి నారాయణపేటకు వస్తుండగా మూడు ఆధార్ కార్డులు చెల్లవని కండక్టర్ శంకరమ్మ చెప్పడంతో టికెట్ తీసుకున్నారు. అయితే ఆ ఆధార్ కార్డులు తిరిగి ఇవ్వాలని ప్రయాణికురాలు నర్సమ్మ కోరగా ఇరువురు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కండక్టర్ సదరు ప్రయాణికులపై చేయి చేసుకుని దామరగిద్ద దగ్గర దింపి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకోబ, రంగారెడ్డి, సూర్యకాంత్, రామ్మోహన్, రవి, నర్సింలు, అనంత్ రెడ్డి, రాము, అంజప్ప పాల్గొన్నారు.

‘ఇందిరమ్మ ఆత్మీయ భరోసా’ అమలుచేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేసి వ్యవసాయ కూలీలందరికీ రూ.12 వేలు సాయమందించాలని ఏపీకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బిజ్వార్‌లో రైతు కూలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీ పనిచేస్తేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేస్తామనడం సరికాదన్నారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు, మూడు ఎకరాలలోపు భూమి కలిగి ఉన్న వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పద్మ, శివలీల, రాము, కత్తలప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఊట్కూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అనేక మంది అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. చాలా గ్రామాలలో సొంతిళ్లు ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారన్నారు. గుడిసెలలో, కిరాయి ఇళ్లల్లో ఉంటూ అవస్థలు పడుతున్న పేదలకు మాత్రం ఇళ్లు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, మాజీ ఉపసర్పచ్ కొండన్ గోపాల్, మాజీ ఎంపీటీసీ హనుమంతు, కృష్ణయ్యగౌడ్, కుర్వ ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.